

### రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో : రుతుపవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా శుక్రవారం రాత్రి 10గంటల వరకు గ్రేటర్‌లోని గాజులరామారం, ఏఎస్ రావు నగర్, కుత్బుల్లాపూర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసినట్లు అధికారులు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.2డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.1డిగ్రీలు, గాలిలో తేమ 76శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ జితేందర్ , హాజరైన పోలీసు ఉన్నతాధికారులు

## ప్రజలతో మమేకమై పని చేయండి

### రాష్ట్ర డీజీపీ జితేందర్

సిటీబ్యూరో, జూలై 19 (నమస్తే తెలంగాణ): సాంకేతిక వనరులను ఉపయోగిస్తూ విజుబులిటీ పోలీసింగ్‌తో ప్రజలతో మమేకమవుతూ ఉత్తమ సేవలందించాలని హైదరాబాద్ పోలీసులకు డీజీపీ జితేందర్ సూచించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి డీజీపీ హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పోలీసింగ్‌లో మార్పు వచ్చిందని, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉత్తమ పద్ధతులను గ్రహిస్తూ ప్రత్యేకతను కల్గి ఉండాలన్నారు. హైదరాబాద్ గ్లోబల్, కాస్మో పాలిటన్ నగర మానవ వనరులు, టెక్నాలజీ, భారీగా పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి జరగడం, అత్యంత నివాస యోగ్యమైన నగరంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నగదు రహిత ట్రాఫిక్ చలాన్ విధానాన్ని అమలులోకి తెచ్చిన సందర్భంగా ఎదురైన సవాళ్లను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సున్నితమైన విషయంలో మాట్లాడే సమయంలో ఎవరికి ఇబ్బంది లేకుండా మాట్లాడాలని, పౌరులతో సరిగా ప్రవర్తించాలని సూచించారు. ఫిర్యాదుదారులను తిప్పి పంపకూడదని వారి సమస్యను తెలుసుకోవాలన్నారు. నేరాలను అదుపు చేయాలని, సాంకేతిక పరమైన శిక్షణ తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఎన్‌ఫోర్స్‌మెంట్, సిగ్నల్స్ వినియోగం సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ విభాగం చేసే పనులను పౌరులతో పంచుకోవాలని సూచించారు.


వీఐపీ సంస్కృతిని అరికట్టడంతో పాటు సోషల్‌మీడియాను హ్యాండిల్ చేసేందుకు మంచి టీమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీలు విక్రమ్‌సింగ్ మాన్, విశ్వప్రసాద్, జాయింట్ సీపీ పరిమళ హననూతన్‌తో పాటు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి లష్కర్ బోనాల వేడుకలకు రావాలని ఆహ్వానిస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు


## లష్కర్ బోనాలకు రండి

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పద్మారావు గౌడ్ ఆహ్వానం



బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ కలిసి ఈ నెల 21న జరిగే సికింద్రాబాద్ బోనాల వేడుకలకు రావాలని కోరారు. శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి బోనాల వేడుకలకు, విందుకు హాజరు కావాలని ఆహ్వానించారు. పద్మారావుగౌడ్‌తో పాటు ఆయన కుమారులు తీగుళ్ల కిశోర్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, కళ్యాణ్, నాయకులు సుంకు రాంచందర్ తదితరులు ఉన్నారు. - సికింద్రాబాద్, జూలై 19

## న్యాక్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ స్కూల్ ప్రారంభం




మాదాపూర్, జూలై 19: వృత్తి, నైపుణ్య శిక్షణలో ఉపాధి కల్పిస్తున్న న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఆధ్వర్యంలో జనరల్ కేటగిరీ బీఈ, బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం 3 నెలల ప్లేస్‌మెంట్ లింక్‌డ్ పేమెంట్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనుంది. ఇందులో ఎస్సీ, బీసీ-సీ వర్గానికి చెందిన బీఈ, బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనుంది. ఉచిత శిక్షణ, భోజన వసతి, 100 శాతం ప్లేస్‌మెంట్ కల్పించనున్నారు. ఈ నెల 22 న ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించేందుకు న్యాక్ సంస్థ సన్నాహాలు చేస్తున్నట్లు ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శాంతిశ్రీ తెలిపారు. శిక్షణలో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థులు 9505631765 గల నంబర్‌ను సంప్రదించగలరు..

## మహంకాళి జాతరకు 175 బస్సులు

సిటీబ్యూరో, జూలై 19(నమస్తే తెలంగాణ): ఉజ్జయినీ మహంకాళి బోనాలను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నగర వ్యాప్తంగా బోనాలకు తరలివచ్చే భక్తులకు 175 బస్సులను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. ఈనెల 21, 22న ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఏమైనా బస్సుల ఆలస్యం సమస్యలు ఉంటే 9959226147, 9959226143, 9959226130 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.



## 'మొక్కజొన్న'కు ఫిదా

### నగరంలోకి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కంకులు

### పెరిగిన విక్రయాలు

### వానకాలంలో కంకులకు డిమాండ్

సిటీబ్యూరో/అబిడ్స్, జూలై 19 (నమస్తే తెలంగాణ): నగరంలో మొక్కజొన్న కంకుల హవా వీస్తోంది. చల్లని వాతావరణంలో వేడివేడి నిప్పులపై కాల్చిన మొక్కజొన్నను ఆరగించడానికి నగరవాసులు అమితాసక్తి కనబరుస్తున్నారు. దీంతో కంకులకు మంచి డిమాండ్ ఏర్పడింది. హైదరాబాద్ నగరానికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర , కర్ణాటక నుంచి కంకులు దిగుమతి అవుతున్నాయి. ప్రతి ఏడాది జూన్‌లోనే కంకులు దిగుమతి ఉండేది. ఈ సారి పంట ఆలస్యంగా రావడంతో జూలై నుంచి కంకుల సందడి నగరంలో కనిపిస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఓల్డ్ సిటీలోని దారూసలాం మార్గంలో కంకులు కుప్పలు తెప్పలుగా కనుల విందును పంచుతున్నాయి. చిరు వ్యాపారులు అక్కడ హోల్‌సేల్‌లో కొనుగోలు చేసి వాటిని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఒక్కో కంకి ధర రూ.5 ఉంది. కాగా, మార్కెట్లో ఈ కంకులు ఒక్కోటి రూ.20. దూర ప్రాంతాల నుంచి నగరానికి తీసుకురావడానికి రవాణా ఛార్జీల భారం పడుతుండటంతో ధరలు పెంచాల్సి వస్తుందని వ్యాపారి చాంద్ పాషా తెలిపారు. ఇప్పటి వరకు కేవలం 20 శాతం మాత్రమే మొక్కజొన్న కంకలు వచ్చాయని ఇంకా 80 శాతం రావాల్సి ఉందని జమీల్ తెలిపారు. సాధారణంగా హోల్‌సేల్ మార్కెట్ తెల్లవారు జామున 5 గంటల నుంచి ఉదయం 9 వరకు ఉంటుందని చెప్పారు. ఈ మొక్కజొన్న సీజన్ ఆగస్టు చివరి వరకు ఉంటుందని, కాగా ఈ వర్షాకాలంలో మొక్కజొన్న కంకులు అధికంగా విక్రయమవుతాయని వ్యాపారులు తెలిపారు. రైతులకు, వినియోగదారులకు నష్టం లేకుండా ధరలు నిర్ణయిస్తామని హోల్‌సేల్ నిర్వాహకులు చెప్పారు. ఈ క్రమంలో సికింద్రాబాద్, అబిడ్స్, దిల్‌షుక్‌నగర్, ఉప్పల్, కూకట్‌పల్లి, బేగంపేట్ రద్దీ ప్రాంతాల్లోని మార్కెట్‌లో మొక్కజొన్న కంకుల సందడి అధికంగా ఉంది. కొంతమంది ఉడికించుకుని ఆరగిస్తుంటే.. ఇంకొందరూ కాల్చుకొని, మరికొందరు గారెలు ఇలా ఏదో ఒక రుచికరమైన ఆహార పదార్థాన్ని తయారు చేసుకుంటూ ఆరగిస్తుండటం విశేషం.

# మీర్‌పేట బీఆర్ఎస్‌దే

### కాంగ్రెస్, బీజేపీలకు చుక్కెదురు

### రెండు సార్లు అవిశ్వాసం పెట్టి బొక్క బోర్లపడ్డ వైనం..

### మీర్‌పేటలో అవిశ్వాసం నెగ్గుతామని తోక ముడిచిన కాంగ్రెస్, బీజేపీలు

### కుట్రలను తిప్పికొట్టిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

### కోరం లేకపోవడంతో డిప్యూటీ మేయర్ పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం



కోరం లేక మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పై పెట్టిన అవిశ్వాసం వీగి పోయిందని ప్రకటిస్తున్న ప్రిసైడింగ్ అధికారి సూరజ్ కుమార్

బడంగ్‌పేట, జూలై 19: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం పెట్టి పై చేయి సాధించాలన్న జాతీయ పార్టీలకు చుక్కెదురైంది. ఒకసారి మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్‌పై అవిశ్వాసం పెట్టి నెగ్గలేక పోయారు. మరోసారి శుక్రవారం డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి పై అవిశ్వాస తీర్మానం పెట్టి పంతం నెగ్గించుకోవాలనుకున్నారు. చివరకు రెండు జాతీయ పార్టీలు బొక్క బోర్ల పడ్డాయి. డిప్యూటీ మేయర్ పై పెట్టిన అవిశ్వాసం నెగ్గాలని కాంగ్రెస్, బీజేపీలు సకల ప్రయత్నాలు చేశాయి. అవిశ్వాసం నెగ్గుతామని తొడలు కొట్టి తోక ముడిచారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 46 మంది కార్పొరేటర్లు ఉన్నారు. 31 మంది కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చారు. కలెక్టర్ పరిశీలించి 15 రోజుల సమయం ఇచ్చి శుక్రవారం ఉదయం 11గంటలకు అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం 11గంటలకు అవిశ్వాసం పెట్టారు. 11.30 గంటల వరకు కార్పొరేటర్లు ఎవరూ కూడా సమావేశం హాలులోకి రాలేదని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి తెలిపారు. 11.30 నుంచి 12.30 గంటలకు మరోసారి సమయం ఇచ్చారు. 12 గంటల తర్వాత కాంగ్రెస్ కార్పొరేటర్లు ఏడుగురు, చివరి 15నిమిషాల్లో బీజేపీ కార్పొరేటర్లు 19 మంది హాజరయ్యారు. 31 మంది కార్పొరేటర్లు హాజరు కావాల్సి ఉండగా 26 మంది సభ్యులు సమావేశానికి వచ్చారు. కోరం లేకపోవడంతో సమావేశం నిర్వహించలేదు. కోరం లేని కారణంగా డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి సూరజ్ కుమార్ ప్రకటించారు. అవిశ్వాసం పెట్టిన నేపథ్యంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ..

రెండు జాతీయ పార్టీలు ఢిల్లీలో కుస్తీ పడుతూ.. గల్లీలో దోస్తీ చేస్తున్నారు. ఆ పార్టీల వెనుకాల పెద్ద నాయకులు ఈ అవిశ్వాసం కథను నడిపించినట్లు తెలుస్తోంది. మహేశ్వరం నియోజకవర్గంలో ప్రత్యక్ష ఎన్నికల్లో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని ఎదుర్కోవడం సాధ్యం కాలేదని ఈ రెండు పార్టీలు నిర్ణయించుకున్నాయి. అవిశ్వాసంలోనైనా తమ పంతం నెగ్గించుకోవాలని ఆ రెండు పార్టీల నాయకులు ఒక్కటయ్యారు. మేయర్ పై అవిశ్వాసం పెట్టి విఫలమయ్యామని, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి పై ఎలాగైనా పట్టు సాధించాలని సకల ప్రయత్నం చేసి చివరికి చతికిల పడ్డారు. రెండు జాతీయ పార్టీలు చేసిన కుట్రలు ఫలించలేదు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి చక్రం తిప్పడంతో డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి అవిశ్వాసంలో పై చేయి సాధించారు. ఇక మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీని కదిలించలేరని తెలిపోయింది.

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఉండగా ఎవరి ఆటలూ సాగవు..



మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో తన పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడానికి అన్ని విధాలుగా రాజకీయ చతురతను ఉపయోగించి తనను గట్టెక్కించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి, సహకరించిన కార్పొరేటర్లకు కృతజ్ఞతలు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అండగా ఉన్నంత కాలం ఎవరి కుట్రలు చెల్లవు. నా పనితీరు నచ్చి గతంలో డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు. మరోసారి కొంత మంది కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి నా వెంట ఉండి సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లకు ఎప్పుడు రుణపడి ఉంటా. అధికార దాహంతో కాంగ్రెస్, బీజేపీలు కుట్రలు పన్ని డిప్యూటీ మేయర్ పదవి నుంచి తప్పించాలని ప్రయత్నం చేశారు. నాపై ఉన్న నమ్మకంతో అండగా నిల్చి మరోసారి అవకాశం కల్పించి మరింత బాధ్యత పెంచారు. తప్పకుండా నా వంతు బాధ్యతగా అభివృద్ధికి కృషి చేస్తా. ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సారథ్యంలో మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలు సబితా ఇంద్రారెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. సహకరించిన వారందరికి కృతజ్ఞతలు. **- తీగల విక్రమ్ రెడ్డి, డిప్యూటీ మేయర్**



ఫతుల్లాగూడ చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్

## చెరువులను పరిరక్షిస్తాం

### ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్

మన్సూరాబాద్, జూలై 19: చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని.. ఎవరైనా చెరువులను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధిలోని ఫతుల్లాగూడ చెరువు ఆక్రమణకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం సదరు ప్రాంతానికి ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్ వెళ్లి పరిశీలించారు. ఫతుల్లాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంత మంది అక్రమ లే అవుట్ చేసి ఇండ్లు కట్టి ప్రజలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సదరు ప్రాంతానికి విచ్చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించారు. చెరువు కబ్జా విషయంపై మేడ్చల్, రంగారెడ్డి జిల్లా రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. గతంలో చెరువు పరిరక్షణ కోసం చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి తప్పుడు సర్వే నంబర్లతో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే మీరు ఏం చేస్తున్నారని అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులను, ఇరిగేషన్ అధికారులను ఆయన ప్రశ్నించారు. అనంతరం ఫతుల్లాగూడ చెరువును డ్రోన్ల ద్వారా సర్వేను ప్రారంభించారు. సర్వే అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఏవీ రంగనాథ్ తెలిపారు. అనంతరం ఫతుల్లాగూడలోని డీఆర్ఎఫ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ప్లానర్ కె.శ్రీనివాస్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగిపై భౌతిక దాడి

### బిల్లుల వసూలుకు వెళ్లిన నేపథ్యంలో ఘటన

### కేసు నమోదు చేసిన పోలీసులు

### సిబ్బందిపై దాడి చేస్తే చట్టపరమైన చర్యలు : సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, జూలై 19 (నమస్తే తెలంగాణ)/ అమీర్‌పేట: విద్యుత్ బిల్లుల వసూలుకు వెళ్లిన ఎర్రగడ్డ ట్రాన్స్‌కో కార్యాలయానికి చెందిన ఉద్యోగులపై వినియోగదారుడు భౌతికంగా దాడి చేశాడు. పెండింగ్‌లో ఉన్న రూ.6858 విద్యుత్ బిల్లును చెల్లించాలని అడిగిన ఉద్యోగుల పై దురుసుగా మాట్లాడటంతో పాటు భౌతికంగా దాడి చేయడంతో ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యుత్ శాఖ అధికారుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీనగర్‌లోని మీసేవా సమీపంలో ఉన్న ఇంటి విద్యుత్ బిల్లు (యూఎస్‌సీ నంబరు-100124620) మొత్తం రూ.6858 చెల్లించాలని ఉద్యోగులు అడిగారు. దీంతో ఇంటి యజమాని కొడుకు మేము కట్టం.. ఏం చేసుకుంటరో చేసుకోండి అనగానే, విద్యుత్ ఉద్యోగి మీటర్ పక్కన ఉన్న ఎంసీబీని బంద్ చేశాడు. దీంతో ఆవేశంతో ఊగిపోయిన వెంకటస్వామి కొడుకు మురళీధర్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ను కిందకు నెట్టేశాడు. అక్కడే ఉన్న మీటర్ రీడర్ సాయి గణేశ్‌పై దాడి చేసి, పిడిగుద్దులతో ముఖంపై, కడుపులో కొట్టాడు. లైన్ ఇన్‌స్పెక్టర్‌ను విడిపించేందుకు ప్రయత్నించినా తోసేసి దాడికి తెగబడ్డాడు. ఈ దాడిలో సాయి గణేశ్ కుడి కన్నుకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. వెంటనే అతడిని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు మురళీధర్‌రావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

### దాడులు చేస్తే చర్యలు తీసుకుంటాం: సీఎండీ

విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ అధికారులు, సిబ్బందిపై దాడి చేయడం, విధులు నిర్వర్తించకుండా అడ్డగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ హెచ్చరించారు. గురువారం బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీనగర్‌లో జరిగిన ఘటనలో గాయపడిన విద్యుత్ శాఖ సిబ్బంది గణేశ్, శ్రీకాంత్, భాస్కర్‌లను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య పరంగా అవసరమైన సహాయం అందించాలని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, గ్రీన్‌ల్యాండ్ డివిజనల్ ఇం జినీర్ సుధీర్‌లను ఆదేశించారు.హుటాహుటిన అతడిని సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తర లించారు. సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మురళీధర్‌రావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచ్చారు.



వినియోగదారుడు చేసిన దాడిలో గాయపడిన విద్యుత్ ఉద్యోగిని పరామర్శిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖీ